# నక్సలైట్లున్నారు జాగ్రత్త

## జర్నలిస్ట్ కథలు

“ఏవిటీ నక్సలైట్లు ఇలా పెట్రేగి పోతున్నారు? ఒహో ఎడిటోరియల్ రాస్తే తప్ప వీళ్ళకి బుద్ధొచ్చేట్టు లేదు” అన్నాడు ఎడిటర్ త్రయంబకం ఆవేశంగా.

“మనం ఎడిటోరియల్ రాస్తిమా, వాండ్లకేం తెలియును, వాండ్లకి చదువు రాదుగా, నక్సలైట్లు అంటే కూలీవాండ్లే గదా!” అంటున్నాడు వంచావకేశన్.

న్యూసెడిటర్ సుబ్బారావు నెత్తీ నోరూ కొట్టుకున్నాడు.

“వాళ్ళంతా బాగా చదువుకున్న వాళ్ళు సార్. బయట ఎక్కడా అనకండి. జనం నవ్వుతారు” అన్నాడు.

“అయితే ఎడిటోరియల్ రాసేద్దాం అంటావా? ఎమ్మెల్యేలనీ, ఆఫీసర్లనీ ఎత్తుకుపోడం ఏవిటయ్యా? ఏ వడ్డీ వ్యాపారినో, మరో దొంగ పీనుగునో ఎత్తుకు పోవచ్చుగా, అమధ్య నన్నెత్తుకు పోయారు చూడు- అప్పుడు వాళ్ళకి గట్టిగా డోసిచ్చా. ఆ దెబ్బకి దాదావు సంవత్సరం పాటు ఎవళ్ళనీ ఎత్తుకు పోలేదు. మళ్ళీ ఓ డోసు ఇవ్వక తప్పేట్టు లేదు” అన్నాడు త్రయంబకం.

నక్సలైట్లు పోయిన సంవత్సరం బుద్ధి తక్కువై త్రయంబకాన్ని ఎత్తుకు పోయారు. త్రయంబకాన్ని వొదలాలంటే కొంతమంది నక్సలైట్లని వొదలాలని షరతు పెట్టారు.

త్రయంబకాన్ని ఎత్తుకు పోయినందుకు ప్రజాగోల స్టాఫు, ముఖ్యంగా సర్క్యులేషన్ వాళ్ళూ బాగా ఆనందించారు. త్రయంబకాన్ని వొదిలేలోగా పేపర్ సర్క్యులేషన్ బాగా పెంచాలని అందరూ ఏకగ్రీవంగా నిర్ణయించారు.

పోలీసులు, హోం మంత్రీ కూడా పట్టించుకోలేదు. కావాలంటే త్రయంబకం వంటి దేశభక్తుణ్ణి బలైనా ఇస్తాం గానీ నక్సలైట్లని వొదిలే సమస్య లేదని ఢంకా మీద దెబ్బ కొట్టి మరీ చెప్పారు.

కానీ మూడోరోజుకి త్రయంబకం తిరిగి వొచ్చేశాడు!

నక్సలైట్లకి అయన మార్క్సిజం, లెనినిజం బోధించాడు. దాంతో వాళ్ళు తలలు సమీపంలోని టేకు చెట్లకేసి బాదుకున్నారు. ఆ తరవాత త్రయంబకం తను రాసిన విప్లవ కవిత్వం వినిపించాడు. ఓ నాలుగు పద్యాలు వినగానే ఒక నక్సలైటు చొక్కా చింపేసుకుని, జుట్టు పీక్కుంటూ గొండుభాషలో అరుచుకుంటూ ఈశాన్య దిశగా పారిపోయాడు. మరో రెండు పద్యాలు తలిగించేసరికి ఇంకో ఇద్దరు నక్సలైట్లు మిడి గుడ్లేసుకుని పిచ్చి చూపులు చూడసాగారు. దాంతో దళం నాయకుడికి కేసు అర్థం అయిపోయింది. మరో నాలుగు పద్యాలు చదవనిస్తే తన దళంలో ఒక్కరు కూడా దక్కరని గ్రహించి అర్జెంటుగా త్రయంబకం నోటికి ప్లాస్టర్ అతికించి అప్పటికప్పుడే సగౌరవంగా ఊళ్ళో తెచ్చి వొదిలేశాడు.

ఆ తరవాత నక్సలైట్ల సెంట్రల్ కమిటీ సమావేశమై కవులను, ముఖ్యంగా జర్నలిస్ట్ కవులను ఎత్తుకు రావడం మంచిదా కాదా అనే విషయం గురించి తీవ్రంగా చర్చించి, ఎంత మాత్రం మంచిది కాదని నిర్ణయించింది. ముందు ముందు పొరపాటున కూడా కవుల్ని ఎత్తుకు రాకుండా వుండగలందులకు గానూ ఆంధ్ర దేశంలో కవులు కాని వాళ్ళ జాబితా తయారు చేయించారు. కవుల జాబితాకంటే కవులు కాని వాళ్ళది చాలా చిన్న జాబితా అయ్యింది. ఈ కార్యక్రమానికి ఓ ఏడాది పట్టింది. అంతేగానీ త్రయంబకం డోసు ఏడాది పని చెయ్యడం కాదు నక్సలైట్లు ఏడాది ఖాళీగా వుండటానిక్కారణం.

“అయితే ఎడిటోరియల్ రాసేద్దామా?” అంటున్నాడు త్రయంబకం.

ఈ మధ్య త్రయంబకం ఎడిటోరియల్ రాయడం మానేశాడు. సుబ్బారావు చేత రాయిస్తున్నాడు. అంచేత పేపర్ కాస్త ఇప్పుడిప్పుడే పుంజుకుంటోంది. మళ్ళీ ఎడిటోరియల్ రాస్తానంటుంటే సర్క్యులేషన్ మేనేజర్ కంగారు పడిపోయాడు.

“వాళ్ళెంత వాళ్ళు సార్ నక్సలైట్లు. వాళ్ళ మొహాలకి సుబ్బారావు గారి ఎడిటోరియల్ చాలు సార్” అన్నాడు ప్రాధేయ పూర్వకంగా.

“సరే అలాగే కానియ్. నేనో నాలుగు పద్యాలు రాసెస్తాను” అంటూ రూములోకి వెళ్ళిపోయాడు త్రయంబకం.

సర్క్యులేషన్ మేనేజర్‌కి మూర్ఛవొచ్చి పడిపోయాడు.

ఇంతలో గుర్నాథం వొచ్చాడు డి.జి.పి. ప్రెస్ కాన్ఫరెన్స్ నించి.

“ఏవంటాడు డి.జి.పి.” అన్నాడు సుబ్బారావు.

“రాష్ట్రంలో పరిస్థితి పూర్తిగా అదుపులో వుందన్నాడు.”

“అదుపులో వుంది సరే! ఎవళ్ళ అదుపులో? వాళ్ళ అదుపులోనా, నక్సలైట్ల అదుపులోనా?”

“ఆ మాటే అడిగితే ఆ డిజిపికి ఇంత కోపం వచ్చింది. ఆ ఎమ్మెల్యే నిర్లక్ష్యంగా పోలీసు వాళ్ళని కాపలా పెట్టుకోకుండా సెకండ్ షో సినిమాకి వెళ్ళాట్ట. కాపలా లేకుండా సెకండ్ షో సినిమాకి వెళ్ళొద్దని రాజ్యాంగంలోనో రామాయణంలోనో రాశారంటాడు.”

“మరి మొన్న కాపలా వుండగానే గుళ్ళో ఎస్పీనీ కాల్చేశారుగా. దానికేవంటాడు?”

“అదీ అడిగా. గుడి గనక, కాళ్ళకి బూట్లున్న కారణంగా కాపలా వాళ్ళు గుడి బయట వుండిపోయారట. నక్సలైట్లు మాత్రం గుళ్ళోకే బూట్లేసుకువొచ్చి మరీ చంపారట. గుళ్ళోకి బూట్లేసుకు రాకూడదనీ, ఒహ వేళ వొచ్చినా ఎవర్నీ గుళ్ళో చంపకూడదని చదువురాని వాళ్ళకూడా తెలును- ఈ మాత్రం ఇంగిత జ్ఞానం నక్సలైట్లకి లేకపోతే అది పోలీసుల తప్పా అంటున్నాడు”

“రాజీనామా చేస్తాడా చెయ్యడా ఇంతకీ”

“ఆ మాటా అడిగా. మొన్న పోలీసులు నక్సలైట్లని చంపారు గదా. అప్పుడు కొండపల్లి సీతారామయ్య రిజైన్ చేశాడా? నేనెందుకు చెయ్యాలి” అంటున్నాడు.

సుబ్బారావు జుట్టు పీక్కున్నాడు.

“సార్ మీరు పీకుతున్నది నా జుట్టు సార్”

జొన్నలగడ్డ రాధాకృష్ణ

అని ఆర్తనాదం చేశాడు అప్పటిదాకా సుబ్బారావు టేబులు మీద తల పెట్టుకుని నిద్రపోతున్న కబ్ రిపోర్టర్ కమలనాథం.

"సారీ నీ జుట్టా. అదే చూస్తున్నా- నా జుట్టు టేబులు మీదకి ఎలా వొచ్చిందా అని. అయినా ఆఫీసులో నిద్రపోవడం ఏవిటయ్యా. బుద్ధి లేదూ. పైగా న్యూస్ఎడిటర్ టేబులు మీదా నిద్రపోయేది- వెళ్ళి వచ్చేసుకో" అని గసిరాడు సుబ్బారావు.

ఈలోగా త్రయంబకం విజయ గర్వంతో ఓ కాయితం పుచ్చుకు బయటకు వొచ్చాడు.

"ఓ వజ్యం రాశా. అంతా వినండి" అంటూ భూన భోనంతరాళాలు దద్దరిల్లే లా చదవ సాగాడు.

"మరిచావా నిన్నటి పాఠాలు.
కిడ్నాపులేనా నీకు డ్యూటీలు!
చెప్పానుగా మార్క్సు ఏమన్నాడో
చెప్పానుగా త్రయంబకం ఏం కన్నాడో
వొదులు భాయీ వొదులు. ప్రగతి బాటపై కదులు!
వొదలక పోతే గొంతెత్తి అరుస్తా
నా కలంతో, కవిత్వంతో కరుస్తా!"

"బావున్నాయి సార్ నాలుగు వజ్యాలూ అమోఘంగా వున్నాయి" అనేశాడు సుబ్బారావు మొహమాటం కొద్దీ.

"నాలుగేవిటోయ్! ఇదంతా ఒకే వజ్యం. ఇంకా ఇలాంటివి మూడు రాయాలి"

సుబ్బారావు ఈసారి జాగ్రత్తగా తన తల ఎక్కడుందో చూసుకుని సొంత జుట్టుని పీక్కున్నాడు.

"సార్ పోలీసుల వ్యవహారం కూడా బావు లేదు సార్. వాళ్ళకీ తగిన శాస్తి చెయ్యాల్సిన సమయం ఆసన్నమైంది సార్. వాళ్ళమీద కూడా ఓ నాలుగు వజ్యాలు దంచండీ" అన్నాడు గుర్నాధం నమ్రతగా.


"వెరీగుడ్ ఐడియా! వాళ్ళమీదా రాసి పడేస్తాను. అప్పుడే మనకి అందరూ సమానమే అని రుజువవుతుంది" అనేసి త్రయంబకం పోలీసులకు, నక్సలైట్లకు, ప్రజాగోల పాలకులకూ తగిన శాస్తి చేసే కృత నిశ్చయంతో తన గదిలోకి వెళ్ళిపోయి తలుపులు బిడాయించుకున్నాడు.

"మా బావగాడు నిండా ప్రమాదంగా కవితే రాసి వుంటాడు." అన్నాడు వంచాపకేశన్ ఆనందంతో ఉబ్బి తబ్బిబ్బైపోతూ.

"మీ బావవాడు కవిత్వం రాస్తే ప్రమాదమే. ప్రమాదం కూడా ఎవరికో కాదు. మన పత్రిక్కే" అన్నాడు గుర్నాధం.

వంచాపకేశన్‌కి గుర్నాధం ఏవన్నాడో అర్థం కాలేదు. అయినా అది జోక్ అయి వుంటుందనే గట్టి నమ్మకంతో గొల్లున నవ్వేశాడు.

"సార్ ఇందాక వజ్యంలో త్రయంబకం కన్నాడు అని రాశారు- కనటం అంటే డెలివరీ గదా అలా ఎందుకు రాశారు సార్" అని అడిగాడు కమలనాథం. ఇందాక త్రయంబకం కవిత్వం చదివిన ధాటికి అతని నిద్రమత్తు అంతా వటావంచలై పోయింది.




"కనడం అంటే డెలివరీయే. త్రయంబకం గారు కవిత్వాన్ని కన్నారు. అంటే డెలివరీ చేశారు. అది కూడా సుఖ ప్రసవం కాదు. అంతగా డౌటుంటే వంచాపకేశన్‌ని అడుగు" అన్నాడు సుబ్బారావు.

"ఏమప్పా- ఇంత మట్టుం తెలియదా అప్పా. కనడం అంటే డెలివరీదా. మా బావ వాడు మంచిగా డెలివరీ చేస్తాడు. నిండా మంచి కవిత్వం వేస్తాడు" అన్నాడు వంచాపకేశన్.

"కవిత్వం వెయ్యడం ఏవిట్రా బాబూ పేడవేసినట్టు-నీకన్నా నా బావే లక్షరెట్లు నయం" అన్నాడు సుబ్బారావు.

వంచాపకేశన్‌కి ఇదీ అర్థం కాలేదు.

అంచేత మరోసారి గొల్లున నవ్వేశాడు.

❋



సముద్ర పక్షుల రక్షణ

గల్ఫ్ యుద్ధ ప్రభావం వల్ల ఏర్పడిన సముద్రి కాలుష్యం నుంచి సముద్రి పక్షులను రక్షించటానికి, బ్రిటన్ తీసుకొన్న చర్యలలో ఒకభాగమే. పక్షులకు జాకెట్ తొడగటం, కొన్ని వేల పక్షులకు ఇలాంటి ఊలు దుస్తులు తొడిగారు, ఈ దుస్తులు పక్షుల శరీరంలోని ఉష్ణోగ్రతను నియంత్రించటమే కాకుండా, వాటికి సముద్ర కాలుష్యంనుంచి పూర్తి రక్షణ కల్పిస్తున్నాయి. గల్ఫ్ యుద్ధం ముగిసి సంవత్సరం దాటినా దాని కాలుష్య ప్రభావం ఇంకా తగ్గలేదు.

— డా.ఎస్.జగన్నాథాచార్యులు.